సాక్షి
నిజామాబాద్
గురువారం । 2 । మార్చి । 2023

తెలంగాణ తిరుమల ఆలయంలోకి వస్తున్న సీఎం కేసీఆర్



ముఖ్యమంత్రిని ఆశీర్వదిస్తున్న వేదపండితులు



సతీసమేతంగా వేంకటేశ్వరస్వామికి మొక్కుతూ..



న్యూస్‌రీల్

నేడు తెయూలో ఇంటర్నేషనల్ వర్క్‌షాప్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ లా విభాగం ఆధ్వర్యంలో 'ఇంటర్‌డిసిప్లినరీ ఎడ్యుకేషన్ సిస్టమ్ ఇన్ యూకే అండ్ ఇండియా: ఆపర్చునిటీస్ అండ్ అబ్‌స్టాకిల్స్' అనే అంశంపై గురువారం ఒక రోజు అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు లా కాలేజ్ ప్రిన్సిపాల్, కన్వీనర్ ప్రసన్నరాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెయూ లా కాలేజ్ సెమినార్ హాల్‌లో జరిగే వర్క్‌షాప్‌లో ప్రధాన వక్తగా శేషేంద్ర శేశభట్టర్(కౌన్సిలర్ అండ్ పేరేంట్ గవర్నర్ ఫర్ స్టేట్ ఫండెడ్ స్కూల్, యునిటైడ్ కింగ్‌డమ్) ప్రసంగిస్తార ని తెలిపారు. వర్క్‌షాప్‌లో వీసీ రవీందర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని, లా డీన్ వినోద్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. వర్క్‌షాప్ కో కన్వీనర్‌లుగా స్రవంతి, జెట్లింగ్ ఎల్లోసాలు వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

మార్కెట్ యార్డులో డీపీసీ ప్రారంభం



ఇందూరు(నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో డైరెక్ట్ పర్చేస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. దీనిని మార్కెట్ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశం బుధవారం ప్రారంభించారు. రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చిన పంటలను ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా ఈ డీపీసీలో విక్రయించుకోవచ్చని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'పీసీసీ అధ్యక్షుడిపై దాడి సరైందికాదు'

ఖలీల్‌వాడి: భూపాలపల్లిలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బహిరంగ సభపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రేవంత్ రెడ్డి పాదయాత్రతో బీఆర్‌ఎస్ నాయకుల పునాదులు కదిలిపోతాయనే బీఆర్‌ఎస్ నాయకులు దాడికి పూనుకున్నారన్నారు. మరొకసారి రేవంత్ రెడ్డి కాన్వాయ్‌కి అడ్డుపడితే తగిన గుణపాఠం చెబుతామని, స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి తన అసమర్థ పాలనను కప్పిపుచ్చుకోవడానికి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

యాదాద్రికి ప్రత్యేక బస్సులు

ఖలీల్‌వాడి: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఎం ఉషాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 21 నుంచి మార్చి 3 వరకు వార్షిక బ్రహోత్సవాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. బ్రహోత్సవాల సందర్భంగా భక్తులు, కుటుంబసభ్యులు, కాలనీవాసులు, బృందాలుగా వెళ్లేవారు కనీసం 30 మంది ప్రయాణికులు ఉంటే ఇంటి వద్దకు ప్రత్యేక బస్సులను పంపిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ కింద డిపో మేనేజర్ల ఫోన్‌నంబర్లను సంప్రదించవచ్చు.

ఆర్మూర్	9959226019
బోధన్	9959226001
నిజామాబాద్-1	9959226016
నిజామాబాద్-2	9959226017
కామారెడ్డి	9959226018
బాన్సువాడ	9959226020

గులాబీ ఫ్లెక్సీ తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ కంఠేశ్వర్ ఆలయం గోడకు ఏర్పాటు చేసిన భారీ గులాబీ ఫ్లెక్సీని అధికారులు తొలగించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఫ్లెక్సీలు పెట్టకూడదని ఏర్పాటు చేసిన బోర్డు వద్దే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఫొటోలతో అధికార పార్టీ నాయకులు పెద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన విషయమై గత 27న 'సాక్షి'లో 'కంఠేశ్వర్ ఆలయానికి గులాబీ ఫ్లెక్సీ' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి ఫ్లెక్సీని తొలగించారు.



పొగడ్తల పర్వం.. అభివృద్ధి జపం

ముఖ్యమంత్రి కేసీఆర్ బాన్సువాడను నిధులతో, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని పొగడ్తలతో ముంచెత్తారు. ఈ మట్టిలో పుట్టి పెరిగిన బిడ్డ.. ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారంటూ ఆకాశానికెత్తారు. శ్రీనివాస్‌రెడ్డి ఆత్మగల్ల వ్యక్తి అంటూ ప్రశంసించిన కేసీఆర్.. ప్రసంగం ఆద్యంతం ఆయనను పొగిడారు. తాను పదవిలో ఉన్నన్ని రోజులు పోచారం బాన్సువాడ నియోజకవర్గ ప్రజలకు సేవలు చేయాల్సిందేనంటూ వచ్చే ఎన్నికల్లో బాన్సువాడ అభ్యర్థి ఎవరో పరోక్షంగా తేల్చేశారు.



తిమ్మాపూర్ బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పాల్గొన్న స్పీకర్ పోచారం, మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు బీబీపాటిల్, సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గణేశ్‌గుప్తా, సురేందర్, హన్మంత్‌సింధే, గంపగోవర్ధన్, బాజిరెడ్డి

సాక్షి, కామారెడ్డి/బాన్సువాడ టౌన్/బాన్సువాడ రూరల్/నస్రుల్లాబాద్: బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నాలుగు రోజులుగా అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బుధవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. వేడుకలో సీఎం కేసీఆర్ దంపతులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. గతంలో తాను ఈ ఆలయానికి వచ్చినపుడు మామూలుగా ఉండేదని, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న గుడిని అభివృద్ధి చేయాలని ఆలోచన చేసి ఆ దిశగా ప్రయత్నం చేశామని పేర్కొన్నారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన మిత్రులతో కలిసి ఈ సత్కార్యాన్ని పూర్తి చేశారన్నారు. వారు కోరుకున్నదాని కంటే గొప్పగా ఈ పుణ్యక్షేత్రం రూపుదిదద్దుకున్నదన్నారు. భగవంతుడు ఆయన సేవ మన తో చేయించుకుంటాడని సీఎం పేర్కొన్నారు. భగవంతుడికి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మీద, బాన్సువాడ మీద దయ కలిగింది కాబట్టే నన్ను కూడా పిలిపించుకొని ఆయనకు సేవ చేయించుకున్నాడన్నారు. మనం చేసిందేమీ లేదని, స్వామే మనతో చేయించాడని పేర్కొన్నారు. స్వామి కరుణ, దయ యావత్ తెలంగాణ ప్రజల మీద ఉండాలని కోరుకున్నానన్నారు.

పోచారం అంటే అభిమానం..

సీఎం కేసీఆర్ తన ప్రసంగంలో ఎక్కువ సమయాన్ని పోచారం శ్రీనివాస్‌రెడ్డిని పొగడ్తలు, ప్రశంసలతో ముంచెత్తడానికే వెచ్చించారు. వయసు పైబడుతున్నా నూతనోత్సాహంతో నిరంతరం ప్రజలకు మేలు చేయాలని పోచారం తపన పడుతుంటారన్నారు. ఆయన అడిగితే తనతో పాటు ఎవరు కూడా కాదనరన్నారు. ఆయన నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని ప్రశంసించారు. సీఎంతో సమానమైన హోదా ఉన్న స్పీకర్ పదవిలో ఉండి కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడానికి వెళతారని, దీనికి ఆయనకు రైతులపై ఉన్న మమకారమే కారణమని పేర్కొన్నారు. దళారుల బారిన పడి రైతులు నష్ట పోకూడదనే ఉద్దేశంతోనే శ్రీనివాస్‌రెడ్డి కల్లాల వెంట తిరుగుతారని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలను సమభావనతో చూసే గొప్ప వ్యక్తి అని, ఆత్మగల్ల వ్యక్తి అని కొనియాడారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి అంటే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో అభిమానమన్నారు. ఆయనపై తనకున్న అభిమానం వల్ల ఎన్ని నిధులు అడిగినా ఇచ్చానని తెలిపారు.

- స్పీకర్‌కు ప్రశంసలు.. బాన్సువాడకు వరాలు
- పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఆకాశానికెత్తిన సీఎం
- ఈ మట్టి కోసమే నిరంతరం తపిస్తారని వ్యాఖ్య
- నియోజకవర్గ అభివృద్ధికి రూ. 50 కోట్లు, ఆలయానికి మరో రూ. ఏడు కోట్లు మంజూరు
- గులాబీ శ్రేణుల్లో జోష్ నింపిన కేసీఆర్ ప్రసంగం



కేసీఆర్‌తో మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

దారిపొడవునా భారీ బందోబస్తు....

సీఎం పర్యటన నేపథ్యంలో బాన్సువాడ పట్టణంలో అడుగడుగునా పోలీసులను మోహరించారు. హెలీప్యాడ్ నుంచి బాన్సువాడ మీదుగా తిమ్మాపూర్ కొండపైనున్న వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పాస్‌లు ఉన్న వారినే కొండపైకి అనుమతించారు. వాహనాలను చెరువు సమీపంలో పార్కింగ్ చేయించడంతో సభకు వచ్చిన అధికారులు, జర్నలిస్టులు ఇబ్బందులు పడ్డారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు బీబీ పాటిల్, సురేష్ రెడ్డి, జోగినపల్లి సంతోష్, ఎమ్మెల్సీలు వీజీగౌడ్, రాజేశ్వర్‌రావ్, టీఎస్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు సురేందర్, హన్మంత్ సింధే, జీవన్‌రెడ్డి, బిగాల గణేశ్‌గుప్తా, మాజీ ఎమ్మెల్యేలు ఆకుల లలిత, నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, నిజామాబాద్ జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, టీఎస్‌పీఎస్సీ సభ్యురాలు సుమిత్రా నంద్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్లు వెంకటేశ్ ధోత్రే, చంద్రమోహన్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1.20 గంటలు ఆలస్యంగా రాక

షెడ్యూల్ ప్రకారం సీఎం కేసీఆర్ ఉదయం 10.40 గంటలకు బాన్సువాడకు చేరుకోవాల్సి ఉంది. అయితే ఆయన హెలికాప్టర్ మధ్యాహ్నం 12 గంటలకు బాన్సువాడకు చేరుకుంది. హెలికాప్టర్ నుంచి దిగిన సీఎం కేసీఆర్ దంపతులు, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు సంతోష్‌రావు, బీబీపాటిల్‌లకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు. అక్కడినుంచి ప్రత్యేక బస్సులో సీఎం కేసీఆర్ దంపతులు సహా ముఖ్యనాయకులంతా బీర్కూర్‌లోని టీటీడీ దేవస్థానానికి బయలుదేరి వెళ్లారు. దారి పొడవునా విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు కేసీఆర్‌కు స్వాగతం పలికారు. వారికి అభివాదం చేస్తూ సీఎం ముందుకు సాగారు.

నియోజకవర్గానికి నిధుల వరద..

బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఏ పనికి ఎన్ని నిధులు అవసరమో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి తెలుసునని, ఆయన వేటికి వినియోగించుకుంటారో ఆయన ఇష్టమని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి మరో రూ.7 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆలయం మరింత అభివృద్ధి చెందాలన్నారు. వెంకటేశ్వర స్వామి దయతో, ప్రభుత్వం అందించే నిధులతో ఆలయం, ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సీఎం ఎక్కడ కూడా రాజకీయాల జోలికి వెళ్లకుండా అభివృద్ధి, ఆధ్యాత్మికం, పోచారం అందిస్తున్న సేవలను గురించే మాట్లాడారు. సీఎం పర్యటనతో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది.



సీఎంతో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

సీఎం గొప్ప వ్యక్తి..

భగవంతుడిని తన హృదయంలో దాచుకుని, స్వామి సేవ చేసేందుకు తనకు అవకాశం కల్పించిన గొప్ప వ్యక్తి సీఎం కేసీఆర్ అని స్పీకర్ పోచారం పేర్కొన్నారు. దేవస్థానం వద్ద ఏర్పాటు చేసినసభలో స్పీకర్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇప్పటివరకు ఆలయాభివృద్ధికి రూ.23 కోట్లు ఇచ్చారన్నారు. నియోజకవర్గానికి గతంలో రూ.100 కోట్ల నిధులు ఇచ్చారన్నారు. మల్లన్న సాగర్ నుంచి నీటిని నిజాంసాగర్‌కు మళ్లించేందుకు రూ. 1,500 కోట్లు మంజూరు చేశారన్నారు. సాగర్ ఆయకట్టు కింద లక్షా 57 వేల ఎకరాలుంటే లక్ష ఎకరాలకు నిజాంసాగర్ నీళ్లు అందుతాయని, మిగత వాటికి జాకోరా ఎత్తిపోతల పథకం, సిద్దాపూర్ రిజర్వాయర్ ద్వారా సాగు నీటిని అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఇరిగేషన్‌కు రూ. 1200 కోట్లు, డబుల్ బెడ్ రూం ఇళ్లకు రూ. వెయ్యి కోట్లు మంజురు చేశారన్నారు. గుడికి 66 ఎకరాల భూమిని కేటాయిస్తున్నట్లు సీఎం జారీ చేసిన జీవోను చూపించారు.



ఆలయ భూమికి సంబంధించిన జీవోను చూపిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

అధి'కార్ల' దోపిడీ..!

- బినామీ పేర్లతో అద్దె వాహనాల ఏర్పాటు
- ప్రతినెలా బిందాస్‌గా బిల్లులు డ్రా
- ఓనర్ కం డ్రైవర్ పథకానికి తూట్లు
- నిరుద్యోగుల ఉపాధికి ఎసరు
- అసలైన నిరుద్యోగులకు బిల్లులు ఇవ్వని వైనం
- ఆర్‌టీఐ కింద అడిగితే కేసు నమోదు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ప్రభుత్వం గౌరవప్రదమైన హోదా కట్టబెట్టి రూ. లక్షల్లో జీతాలు ఇస్తున్నప్పటికీ కొందరు అధికారులు మాత్రం కాసుల కక్కుర్తి వదలడం లేదు. ప్రభుత్వ విభాగాల్లో ఓనర్ కం డ్రైవర్ పథకానికి యథేచ్ఛగా తూట్లు పొడుస్తూ నిరుద్యోగుల పొట్టకొడుతున్నారు. జిల్లా మెడికల్ అండ్ హెల్త్ విభాగంలో బినామీ పేర్లతో వాహనాలు ఏర్పాటు చేసుకుని అధికారులే ప్రతినెలా దోపిడీ చేస్తున్నారని పలువురు నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల, వారి బంధువులకు చెందిన వాహనాలను అద్దె ప్రాతిపదికన పెట్టుకోకూడదనే నిబంధన ఉన్నప్పటికీ దాన్ని తుంగలో తొక్కి నిరుద్యోగుల ఉపాధికి ఎసరు పెడుతున్నారు. కార్లు, అంబులెన్స్‌లు, టీ హబ్(శాంపిల్స్ తీసుకెళ్లే వాహనాలు) బినామీ పేర్లతో పెట్టుకుని ప్రతినెలా వాహనం తిరిగిన దానికంటే అదనంగా డబ్బులు దండుకుంటున్నారు. మరోవైపు నిరుద్యోగుల వాహనాలకు సంబంధించి చెల్లించాల్సిన మొత్తాన్ని మాత్రం చెల్లించకుండా డీఎంహెచ్‌వో తిప్పలు పెడుతుండడం గమనార్హం. జిల్లాలో కోవిడ్ సమయంలో 2020 మార్చి నుంచి 2020 ఆగస్టు వరకు నిరుద్యోగులు తిప్పిన వాహనాల విషయమై మొత్తం 15 మందికి 1,06,070 కిలోమీటర్లకు సంబంధించి రూ. 15,91,050 ఇప్పటివరకు ఇవ్వకుండా తిప్పలు పెడుతుండడంపై గగ్గోలు పెడుతున్నారు. ఉద్యోగుల బినామీల వాహనాలకు మాత్రం అడ్వాన్సులు సైతం చెల్లిస్తుండడం విశేషం. బినామీల వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేస్తే మరిన్ని బాగోతాలు బయటకు వస్తాయని నిరుద్యోగులు చెబుతున్నారు.



ఓ ఉద్యోగికి చెందిన టీ హబ్ వాహనం

బినామీ పేర్లతో ఉద్యోగుల వాహనాలు

ఇదిలా ఉండగా డీఎంహెచ్‌వో విభాగం ద్వారా ఆర్‌బీఎస్‌కే, టీ హబ్, అంబులెన్స్ వాహనాలు పలువురు అధికారులు, ఉద్యోగులు తమ బినామీ పేర్లపై పెట్టుకున్నారు. వీటిలో కొన్ని వాహనాలకు అడ్వాన్సులు సైతం ఇచ్చుకోవడం గమనార్హం. తక్కువ కిలోమీటర్లు తిరిగినా ఎక్కువగా తిరిగినట్లు దండుకుంటున్నట్లు తెలుస్తోంది. కాగా వాహనాలకు ఇన్‌చార్జిగా ఉన్న ఓ ఉద్యోగి కుమారుడి పేరుపై పెట్టిన వాహనానికి నెలలో కేవలం 852 కిలోమీటర్లు తిరిగినప్పటికీ చెల్లింపులు మాత్రం మూడు రెట్లు చేయడం విశేషం. ఇక మరో జూనియర్ అసిస్టెంట్ తన బినామీల ద్వారా 3 వాహనాలు అద్దెకు పెట్టడం గమనార్హం. ప్రభుత్వ డ్రైవర్ అయి న మరో ఉద్యోగి బినామీ పేర్లతో నాలుగు వాహనాలు అద్దెకు పెట్టారు. వీళ్ల వాహనాలకు మాత్రం రెగ్యులర్‌గా చెల్లింపులు చేస్తుండడం గమనార్హం.

డిచ్‌పల్లి మండలం మిట్టపల్లికి చెందిన సమీర్ హైమద్ అనే ఓనర్ కం డ్రైవర్ కోవిడ్ సమయంలో అద్దె ప్రాతిపదికన నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం కింద తన వాహనం తిప్పాడు. ఇతని వాహనాన్ని 14,630 కిలోమీటర్లు తిప్పుకున్నారు. ఇందుకు గాను రూ. 2,19,450 ఇవ్వాల్సి ఉంది. డబ్బు చెల్లించకుండా డీఎంహెచ్‌వో ఇబ్బందులు పెట్టినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దీంతో సమీర్ నవంబర్ 18, 20 22న సమాచార హక్కు చట్టం కింద చెల్లింపులకు సంబంధించిన వివరాలు అడిగాడు. సమాచారం ఇవ్వకపోగా తనను కార్యాలయానికి పిలిపించి దాడి చేయించినట్లు తెలిపాడు. స.హ.చట్టం కింద పెట్టిన దరఖాస్తును వెనక్కి తీసుకోకపోతే వదిలిపెట్టమని బెదిరింపులకు గురిచేసినట్లు తెలిపాడు. పైగా తన వాహనం అద్దె కాంట్రాక్ట్‌ను రద్దు చేసినట్లు వాపోయాడు. తనపై దాడి విషయమై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నాడు. పైగా తనపైనే అక్రమంగా కేసు పెట్టించినట్లు కన్నీరు పెట్టుకున్నాడు. కాగా ఇలా డబ్బుల కోసం చెప్పులరిగేలా తిరుగుతున్న ఓనర్ కం డ్రైవర్లు మరికొందరు ఉన్నారు.



మరో ఉద్యోగికి చెందిన అంబులెన్స్



ఓ ఉద్యోగికి చెందిన ఆర్‌బీఎస్‌కే వాహనం

నకిలీ పట్టాలపై ఇంటెలిజెన్స్ ఆరా..!

- నివేదిక రూపొందించిన అధికారులు
- ప్రభుత్వానికి అందజేత

ఖలీల్‌వాడి: నగరంలో కలకలం రేపిన నకిలీ పట్టాల వ్యవహారంపై ఇంటెలిజెన్స్ ఆరా తీసినట్లు తెలుస్తోంది. నగరంలో ఎక్కడడెక్కడ నకిలీ పట్టాలపై భూములు ఉన్నాయనే వివరాలు సేకరించడంతో పాటు ఫీల్డ్‌కు వెళ్లి వాటిని పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న భూముల సర్వే నంబర్లను కూడా సేకరించారు. బడుగు, బలహీనవర్గాల వారికి ఇచ్చిన పట్టాలెన్ని.. ఇప్పుడు పుట్టుకొచ్చిన నకిలీ పట్టాలెన్ని అనే కోణంలో వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఎవరికి ఇచ్చిన భూమిలో ఎవరు ఉన్నారనే విషయాలు సైతం తెలుసుకున్నారు. ఈ నకిలీ పట్టాల ముఠా సభ్యులకు ఎవరెవరు సహకారం అందించారనే వివరాలతో జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం ఈ జాబితాలో ఇద్దరు రిపోర్టర్లు, ఓ ప్రజాప్రతినిధి సోదరుడి పేర్లు వచ్చినట్లు తెలిసింది. దాదాపు రూ. కోట్ల భూమి అన్యాక్రాంతమైనట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి అందజేసినట్లు సమాచారం.

సెలవులో రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగి

నగరంలోని ఓ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ విషయంలో ఓ ప్రధాన పత్రిక విలేకరి రిజిస్ట్రేషన్ శాఖలోని ఓ ఉద్యోగిని ఇబ్బందులు ఇబ్బందులకు గురిచేయడంతో సదరు ఉద్యోగి సెలవులో వెళ్లినట్లు ప్రచారం జరుగుతుంది. మొదట 15 రోజులు సెలవుపై వెళ్లగా.. మరో 10 రోజుల పాటు సెలవును పెంచుకున్నట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ శాఖలో అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి పలు డాక్యుమెంట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించిన ఘటనల్లో గతేడాది ఒకరు సస్పెండ్ కాగా, ప్రస్తుతం మరో ఇద్దరు ఉద్యోగులు కేసుల్లో ఇరుక్కోవడం ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

నాగారంలో ఆగిన వెంచర్

నగరంలోని నాగారంలో ఓ ప్రధాన పత్రిక విలేకరి, మరొకరితో కలిసిన అనుమతులు లేకుండానే వెంచర్‌ను ఏర్పాటు చేశారు. అయితే వెంచర్‌లో అక్రమంగా ప్రభుత్వ భూమిని కూడా కలుపుకున్నట్లు తెలిసింది. అనుమతులు లేకపోవడం, ప్రభుత్వం భూమిని ఆక్రమించడంతో కొందరు అభ్యంతర్యాలు వ్యక్తం చేయడంతో వెంచర్‌లో ప్లాట్ల అమ్మకాలు నిలిపివేసినట్లు సమాచారం.

నేర ఒప్పుకోలు పంచనామాపై చర్చ

నగరంలో నకిలీ పట్టాల వ్యవహారంపై మూడో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఇందులో 12 మంది నిందితుల పేర్లను చేర్చారు. వీరిలో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం ఈ ఇద్దరు బెయిల్ బయటకు వచ్చారు. ఈ కేసులో నేర ఒప్పుకోలు పంచనామాపై ఉద్యోగుల సమక్షంలో కాకుండా ఇద్దరు ప్రైవేటు వ్యక్తుల సమక్షంలో రాయడంపై చర్చ జరుగుతోంది. పంచనామా ఇద్దరు ప్రైవేటు వ్యక్తుల సమక్షంలో రాయడంతో కేసు పూర్తయ్యే వరకు వారు నిలబడతారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగుల సమక్షంలో పంచనామా ఒప్పుకోలు చేస్తే కేసు గట్టిగా నిలబడే అవకాశం ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

క్లుప్తంగా

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి



మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): సీఎం కేసీఆర్‌ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తోందని జిల్లా ఒలంపిక్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డి పేర్కొన్నారు. బోర్గాం(పి)లోని తన కార్యాలయంలో బుధవారం పద్మశాలీ, విశ్వబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ భవనాలకు స్పెషల్‌ డెవలప్‌మెంట్‌ ఫండ్‌ నుంచి రూ.5లక్షల చొప్పున నిధుల మంజూరు పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. వెనకబడిన తరగతుల సంక్షేమానికి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నుడా డైరెక్టర్‌ అభిలాష్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సారెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మోహనచారి, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తెయూలో బయోఇన్ఫర్మాటిక్స్‌ పరిశోధనశాల



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగంలో బయో ఇన్ఫర్మాటిక్స్‌ ఆధునిక పరిశోధనశాలను ఏర్పాటు చేస్తున్నట్లు వర్సిటీ వీసీ ప్రొఫెసర్‌ రవీందర్‌ తెలిపారు. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న శాస్త్ర సాంకేతిక రంగాలలోని పరిశోధన ఫలితాలను తెయూ విద్యార్థులు అందిపుచ్చుకోవడం కోసం 'యునైటెడ్‌ వే హైదరాబాద్‌' వారి సహకారంతో ఈ పరిశోధనశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈమేరకు బుధవారం ఆయన తెయూలోని తన ఛాంబర్‌లో మాట్లాడారు. యునైటెడ్‌ వే హైదరాబాద్‌ – తెయూ మధ్య ఎంవోయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. పరిశోధనశాల ఏర్పాటుకు రూ.45,26,763 లు నిధులను యునైటెడ్‌ వే హైదరాబాద్‌ సంస్థ మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో పరిశోధనశాల నిర్మాణంతో పాటు 80 డెస్క్‌టాప్‌ కంప్యూటర్లు, ఐదు ల్యాప్‌టాప్‌లు, హెచ్‌ఈపీ సర్వర్‌, ఇంటర్నెట్‌ రూటర్లు, సోలార్‌ సిస్టం, ఫర్నిచర్‌ తదితర సామగ్రి కొనుగోలు చేయనున్నట్లు వీసీ తెలిపారు. నిధుల సమకూర్చడంలో తోడ్పడిన తెయూ బయోటెక్నాలజీ విభాగం అధ్యాపకులు మామిడాల ప్రవీణ్‌, యునైటెడ్‌ ఇండియా హైదరాబాద్‌ సీనియర్‌ మేనేజర్‌ లాష్యక్‌, ఖదీర్‌లను వీసీ అభినందించారు. వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ విద్యావర్ధిని, అధ్యాపకులు జవేరియా, ఉజ్మా, కిరణ్మయి, మహేందర్‌, ప్రసన్నశీల తదితరులు పాల్గొన్నారు.

పుస్తకం ఆవిష్కరణ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ప్రోగ్రామర్‌ కమ్‌ సిస్టం అడ్మినిస్ట్రేటర్‌ (అవుట్‌ సోర్సింగ్‌)గా పని చేస్తున్న మహీ నవీన్‌కుమార్‌ రచించిన 'హ్యాండ్‌ బుక్‌ ఆన్‌ బిగ్‌ డేటా అండ్‌ మిషన్‌ లెర్నింగ్‌' అనే పుస్తకాన్ని వీసీ ప్రొఫెసర్‌ రవీందర్‌ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకవైపు విధులు నిర్వహిస్తూనే మరోవైపు కంప్యూటర్‌ కోర్సు చేసే డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఉపయోగపడేలా పుస్తకం రాయడం అభినందనీయమని, నవీన్‌ను ప్రశంసించారు. బుక్‌ డ్రైవర్స్‌ సంస్థ పబ్లిష్‌ చేసిన ఈ పుస్తకం అమెజాన్‌, ఫ్లిప్‌కార్ట్‌, గూగుల్‌ప్లే, అమెజాన్‌ కైండిల్‌ తదితర ఆన్‌లైన్‌ స్టోర్స్‌లో లభిస్తుందని తెలిపారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ విద్యావర్ధిని, కంప్యూటర్‌ ఫ్యాకల్టీ అతిక్‌, ఇతర అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



తిమ్మాపూర్‌లో సీఎం బహిరంగ సభకు హాజరైన ప్రజలు

సీఎం పర్యటన సాగిందిలా..

బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్‌ మండలం తిమ్మాపూర్‌లోగల తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో బుధవారం సీఎం కేసీఆర్‌ దంపతులు పాల్గొన్నారు. అంతకుముందు సీఎం హైదరాబాద్‌ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి బాన్సువాడకు వచ్చారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు, స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు సీఎంకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సీఎం బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలివచ్చారు. సీఎం పర్యటన సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు యంత్రంగం పటిష్ట ఏర్పాట్లు చేశారు.



సీఎం కేసీఆర్‌ రాక సందర్భంగా ఆలయం వద్ద పోలీసుల భారీ బందోబస్తు




ఆలయానికి విచ్చేస్తున్న సీఎం కేసీఆర్‌ కాన్వాయ్‌



బాన్సువాడలో అభివాదం చేస్తూ బస్సులో వెళ్తున్న సీఎం, స్పీకర్‌



సీఎం రాకకోసం హెలీప్యాడ్‌ వద్ద ఎదురు చూస్తున్న స్పీకర్‌ పోచారం, తదితరులు



సీఎం కేసీఆర్‌ దంపతులను పట్టువస్త్రాలతో సత్కరిస్తున్న స్పీకర్‌ దంపతులు





సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న జుక్కల్‌ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే.. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్‌రెడ్డి



హెలీప్యాడ్‌ వద్ద ముచ్చటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు





ఆలయంలో కూర్చున్న ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు.. సభాస్థలి వద్ద ఏర్పాట్లను సమీక్షిస్తున్న కలెక్టర్‌





సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలకడానికి ప్లకార్డులతో వేచిఉన్న మహిళలు



బాన్సువాడలోని స్పీకర్‌ ఇంట్లో తేనీటి విందుకు హాజరైన సీఎం కేసీఆర్‌ దంపతులు

సీఎం పర్యటన సైడ్‌లైట్స్‌...

- ఉదయం 10.30 గంటలు: హెలీప్యాడ్‌కు చేరుకున్న ఆర్మూర్‌, నిజామాబాద్‌ అర్బన్‌, రూరల్‌ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బిగాల గణేశ్‌ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్‌.
- 10.38 గంటలు: ఉప్పల్‌, ఎల్లారెడ్డి, బోధన్‌, జుక్కల్‌ ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, సురేందర్‌, షకీల్‌ ఆమేర్‌, హన్మంత్‌ సింధే, టీఎస్‌పీఎస్‌సీ డైరెక్టర్‌ సుమిత్రానంద్‌ రాక.
- 11.00 గంటలకే హెలీప్యాడ్‌ సమీపానికి ప్రజలు చేరుకున్నారు. రోడ్లన్నీ బీఆర్‌ఎస్‌ శ్రేణులతో కిక్కిరిసిపోయాయి.
- 11.57 గంటలు: బాన్సువాడకు చేరుకున్న సీఎం హెలీకాప్టర్‌. సీఎంకు స్వాగతం పలికిన స్పీకర్‌, ప్రజాప్రతినిధులు.
- 12.03 గంటలు: ప్రత్యేక బస్సులో బీర్కూర్‌లోని టీటీడీకి బయలు దేరిన సీఎం కేసీఆర్‌ దంపతులు.
- 12.30 గంటలు: దేవస్థానం అలిపిరి వద్ద పైలాన్‌ ప్రారంభం.
- 12.40 గంటలు: కొండపైకి చేరుకున్న సీఎం.
- 12.43 గంటలు: పూర్ణకుంభంతో స్వాగతం పలికిన వేద పండితులు, స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులు.
- 12.45 గంటలు:స్వామి వారిని దర్శించుకున్న సీఎం కేసీఆర్‌.
- 12.48 గంటలు: స్వామి వారికి రెండున్నర కిలోల స్వర్ణ కిరీటం బహూకరణ.
- 01.03 గంటలు: ఆలయ ప్రాంగణంలో మొక్కను నాటిన సీఎం.
- 01.08 గంటలు: స్వామివారి కల్యాణం..
- 01.31 గంటలు: కొండపై నుంచి సభాస్థలానికి కేసీఆర్‌.
- 01.36 గంటలు: వేదికపైకి సీఎం కేసీఆర్‌, స్పీకర్‌, ప్రముఖులు.
- 01.40 గంటలు: స్పీకర్‌ పోచారం ప్రసంగం
- 01.55 గంటలు: సీఎం కేసీఆర్‌ ప్రసంగం ప్రారంభం
- 02.12 గంటలు: సీఎం ప్రసంగం ముగింపు
- 02.55 గంటల వరకు సీఎం, మంత్రి, స్పీకర్‌, ఇతర ప్రజాప్రతినిధుల భోజనాలు పూర్తి.
- 02.56 గంటలు: బాన్సువాడకు బయలుదేరిన సీఎం కాన్వాయ్‌.
- 3.25 గంటలు: బాన్సువాడలోని స్పీకర్‌ పోచారం నివాసానికి చేరుకున్న సీఎం.
- 3.38 గంటలు: స్పీకర్‌ పోచారం కుటుంబ సభ్యులతో కలిసిటీ, స్నాక్స్‌ తీసుకున్న సీఎం దంపతులు.
- 4.03 గంటలు: ప్రత్యేక బస్సులో బాన్సువాడలోని హెలీప్యాడ్‌కు చేరుకున్న సీఎం.
- 4.12 గంటలు: హెలీకాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరుగుపయనం.

క్రైం కార్నర్‌

బైక్‌ను ఢీకొన్న మిల్లర్‌

- భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు
- చిన్నమల్లారెడ్డి వద్ద ఘటన

కామారెడ్డి క్రైం: బంధువుల ఇంటికని బైక్‌పై బయలుదేరిన దంపతులను రెడీమిక్స్‌ మిల్లర్‌ వాహనం ఢీకొనడంతో ప్రమాదానికి గురయ్యారు. భార్య మృతి చెందగా భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన కామారెడ్డి మండలం చిన్న మాల్లారెడ్డి గ్రామానికి సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. రాజంపేటకు చెందిన కుమ్మరి వెంకట్‌, అతని భార్య వినోద (45)లు కామారెడ్డిలోని బంధువుల ఇంటికని బైక్‌పై బయలుదేరారు. చిన్న మల్లారెడ్డి చెరువు వద్దకు రాగానే సీసీ రోడ్డు పనులకు కాంక్రీట్‌ తీసుకువెళ్తున్న ఓ రెడీమిక్స్‌ మిల్లర్‌ వాహనం వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన దంపతులను స్థానికులు వెంటనే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే వినోద మృతి చెందగా.. వెంకట్‌ చికిత్స పొందుతున్నాడు. ప్రమాదానికి కారణమైన మిల్లర్‌ను డ్రైవర్‌ రాజంపేటలో వదలేసి పరారైనట్లు తెలిసింది. దేవునిపల్లి పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్‌ తెలిపారు.



మృతి చెందిన వినోద

కుటుంబ కలహాలతో వృద్ధుడి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ వృద్ధుడు కుటుంబ కలహాలు, అనారోగ్యం కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని దుబ్బ ఏరియాలో యాదగిరి(76) నివసిస్తుండేవాడు. కుటుంబంలో కలహాలు రావడం, ఆరోగ్యం సరిగా లేకపోవడంతో బుధవారం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్‌ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మోపాల్‌లో వివాహిత..

మోపాల్‌: మండలంలోని మోపాల్‌ గ్రామంలో ఓ వివాహిత బుధవారం కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. బోనాలకు చెందిన లావణ్య(30)కు, మోపాల్‌కు చెందిన మోహన్‌కు పదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. లావణ్య బీడీ కార్మికురాలు కాగా, భర్త ఆటో నడుతుంటాడు. ఇటీవల భార్యభర్తల మధ్య గొడవలు జరగడంతో, లావణ్య ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. వారు ఘటనాస్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ బడులను అన్ని హంగులతో తీర్చిదిద్దాలి

- ఈనెల 15లోగా పనులన్నీ పూర్తి చేయాలి
- కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల పరిశీలన



మెంట్రాజ్‌పల్లిలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు

డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి: 'మన ఊరు – మన బడి' కార్యక్రమం నిధులతో ప్రభుత్వ పాఠశాలలను అన్ని హంగులతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి మండలాల్లో బుధవారం ఆయన, అదనపు కలెక్టర్‌ చిత్రామిశ్రాతో కలిసి పర్యటించారు. ఆయా గ్రామాల్లో 'మన ఊరు – మన బడి' పనులను, కంటి వెలుగు శిబిరాలను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. పాఠశాలల్లో ఈ నెల 15లోపు అన్ని పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉపాధిహామీ కింద మంజూరు చేసిన పనులను కూడా యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే పనుల్లో జాప్యం జరిగిందని, తుది దశ పనులను నాణ్యతతో చేపడుతూ సత్వరమే పూర్తి చేసేలా పర్యవేక్షణ జరపాలని ఇంజినీరింగ్‌ అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయిన వెంటనే ఎఫ్‌టీవోలు జెనరేట్‌ చేస్తూ, కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందేలా చూడాలని సూచించారు. కంటి వెలుగు శిబిరాల్లో మెరుగైన సేవలందించాలని, ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని సిబ్బందికి సూచించారు. నర్సరీలలో మొక్కల పెంపకాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. డీఆర్‌డీవో చందర్‌నాయక్‌, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్‌ సుదర్శనం, జక్రాన్‌పల్లి ఎంపీపీ కుంచాల విమలరాజు, డిచ్‌పల్లి తహసీల్దార్‌ శ్రీనివాసరావు, ఎంపీవో నిట్టు కిషన్‌రావు, ఎంఈవో రాజగంగారాం తదితరులు ఉన్నారు.

ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌ స్థలం పరిశీలన

పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని పెర్కిట్‌లో నిర్మించనున్న సమీకృత వెజ్‌ అండ్‌ నాన్‌వెజ్‌ మార్కెట్‌ స్థలాన్ని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు బుధవారం పరిశీలించారు. నిర్మాణ విషయమై అదనపు కలెక్టర్‌ చిత్రామిశ్రా, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్‌ వేణుగోపాల్‌గౌడ్‌తో చర్చించారు. మున్సిపల్‌ కమిషనర్‌ మనోహర్‌, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వర్క్‌వీసా పేరుతో మోసం..

- ముగ్గురిపై చీటింగ్‌ కేసు

నవీపేట: మండలంలోని నాడాపూర్‌ గ్రామానికి చెందిన ఇద్దరిని వర్క్‌ వీసా పేరుతో మోసం చేసిన ముగ్గురిపై చీటింగ్‌ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి బుధవారం తెలిపారు. నాడాపూర్‌కు చెందిన గోసంగి గంగాధర్‌, సాయిబాబాలు, గ్రామానికి చెందిన గల్ఫ్‌ ఏజెంట్‌, మధ్యవర్తి భూదర్శన్‌కు రూ. 20వేల చొప్పున చెల్లించి పాస్‌పోర్టు పొందారు. అలాగే కామారెడ్డికి చెందిన ఏజెంట్‌ రాజేశ్వర్‌కు ఇద్దరు మరో రూ. 60వేల చొప్పున చెల్లించారు. డబ్బుల చెల్లింపులో మాక్లూర్‌ మండలంలోని చిక్లీ గ్రామానికి చెందిన వెంకట్‌ మధ్యవర్తిగా వ్యవహరించారు. అనంతరం వర్క్‌ వీసా ఇప్పిస్తామని ఏజెంట్లు చెప్పి విజిట్‌ వీసా ఇప్పించారు. ఈక్రమంలో డిసెంబర్‌ 10న మలేషియా వెళ్లిన గోసంగి గంగాధర్‌, సాయిబాబాలు పది రోజుల కిందట స్వదేశానికి తిరిగి వచ్చారు. అనంతరం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాడాపూర్‌ గ్రామానికి చెందిన భూదర్శన్‌, కామారెడ్డికి చెందిన రాజేశ్వర్‌, చిక్లి గ్రామానికి చెందిన వెంకట్లపై చీటింగ్‌ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నవీపేటలో ముగ్గురిపై అట్రాసిటీ కేసు

నవీపేట: మండల కేంద్రానికి చెందిన సిలిమల గంగాధర్‌ను కులం పేరుతో దూషించిన ఘటనలో ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి బుధవారం తెలిపారు. పొలం విషయంలో జరిగిన ఘర్షణలో సిలిమల గంగాధర్‌ను పొట్లూరి సవిత, కరిపె సంతోష్‌, లక్ష్మినారాయణలు కులం పేరుతో దూషించారని పేర్కొన్నారు. ఈమేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

డబ్బులు డ్రా చేసి వస్తుండగా చోరీ



సీసీటీవీ ఫుటేజీలో నమోదైన నిందితుడి దృశ్యం

భీమ్‌గల్‌: మండలకేంద్రంలో ఓ మహిళ బ్యాంకు నుంచి డబ్బులు డ్రా చేసి, వస్తుండగా గుర్తుతెలియని దుండగుడు చోరీ చేశారు. ఎస్సై రాజ్‌ భరత్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. మెండోర గ్రామానికి చెందిన గౌరు పుష్ప నగదు తీసుకోవడానికి బుధవారం భీమ్‌గల్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్‌కి వెళ్లింది. బ్యాంక్‌ నుంచి రూ.45వేలు నగదు డ్రాచేసుకొని ఒక కవర్లో పెట్టుకొని బస్టాండ్‌ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా.. గుర్తుతెలియని ఓ వ్యక్తి బైక్‌పై వెనుక నుంచి వచ్చి ఆమె చేతిలో ఉన్న డబ్బుల కవర్‌ను దొంగలించుకొని పారిపోయాడు. ఈమేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ కాయిల్‌..

నస్రుల్లాబాద్‌(బీర్కూర్‌): బీర్కూర్‌ మండలంలోని బరంగేడ్గి గ్రామంలోగల ఎల్కోని సుభాస పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ నుంచి మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు రాగిని దొంగిలించినట్లు బాధిత రైతు పేర్కొన్నారు. దీంతో వ్యవసాయ భూమిలో నీరు పారించేందుకు ఇబ్బంది అవుతుందని ఆయన వాపోయాడు .

వైకుంఠధామంలో బోరుమోటార్‌..



బోరుమోటార్‌ చోరీకి గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీవో శ్రీనివాస్‌

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారెడ్డి గ్రామపంచాయతీ పరిధిలో గల వైకుంఠధామం వద్దనున్న బోరుబావిలో అమర్చిన మోటార్‌ను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బుధవారం గ్రామంలో చెత్త సేకరణ ట్రాక్టర్‌ డ్రైవర్‌ వైకుంఠధామం సమీపంలోని డంపింగ్‌యార్డుకు వెళ్లగా.. మోటార్‌ చోరీని గుర్తించారు. బోరుమోటారును బోరుబావిలో నుంచి పైకిలేపి పైపును, కేబుల్‌వైర్‌ కత్తిరించి మోటార్‌ను ఎత్తుకుపోయినట్లు పంచాయతీ సిబ్బంది గుర్తించారు. సమాచారం అందుకున్న ఎంపీవో శ్రీనివాస్‌, సర్పంచ్‌ శ్రీధర్‌గౌడ్‌, జీపీ కార్యదర్శి సత్యనారాయణ ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈవిషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు.

ట్రాక్టర్‌ దహనం

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో బుధవారం వేకువజామున గుర్తుతెలియని వ్యక్తులు ఓ ట్రాక్టర్‌ను దహనం చేశారు. గ్రామానికి చెందిన ఆకుతోట దేవానంద్‌ గత నెల 22న సిర్నాపల్లి గ్రామానికి చెందిన మల్లారెడ్డి వద్ద ట్రాక్టర్‌ కొనుగోలు చేశాడు. అనంతరం ట్రాక్టర్‌ను పెద్దమల్లారెడ్డి గ్రామంలోని తన వ్యవసాయ పొలం వద్ద పెట్టాడు. బుధవారం ఉదయం దేవానంద్‌ తన పొలం వద్దకు వెళ్లి చూడగా, ట్రాక్టర్‌ దహనమై ఉంది. గ్రామానికి చెందిన కొందరూ తన ట్రాక్టరును దహనం చేసి ఉంటారని, అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.